ఉచిత బస్సులేనా..?

- సత్తెనపల్లి డిపోలో తీవ్రమైన బస్సుల కొరత
- బస్టాండ్‌లో మహిళలకు అవస్థలు
- మూత్ర విసర్జనకు ఉగ్గబట్టాల్సిందే
- 22 గ్రామాలకు బస్సు సౌకర్యం నిల్


సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్


సత్తెనపల్లి బస్టాండ్‌లో మూత్రవిసర్జనకు వెళ్లాలంటే అవస్థే

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ఈ నెల 15వ తేదీ(నేడు) నుంచి అమలు చేస్తామంటూ ప్రకటనలు చేస్తూ వచ్చింది. అయితే సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు చెందిన సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో ఇప్పటికే ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రంగా ఉంది. 22 గ్రామాలకు పైగానే ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. ముఖ్యమైన గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు లేవు. దీంతో 21 వరకు అద్దె బస్సులను తీసుకొని పలు మార్గాల్లో నడుపుతున్నారు.

కొత్త బస్సుల ఊసే లేదు

సత్తెనపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో మొత్తం 55 బస్సులు ఉన్నాయి. వీటిలో 34 ఆర్టీసీకి చెందినవి కాగా, 21 అద్దె బస్సులు. ఇవి 19 రూట్లలో రోజుకు 20,230 కిలోమీటర్లు తిరుగుతున్నాయి. వీటిలో పల్లె వెలుగు 50 బస్సులను మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి సర్దుబాటు చేశారు. గ్రామీణ ప్రాంతాలకు వెళుతున్న పల్లె వెలుగు సర్వీసులను ఉచిత బస్సుల కోసం ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు ఉండవని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు డిపోలో కొత్త బస్సుల ఊసే లేదు. పాడైన సర్వీసులకు మరమ్మతులు చేసి తిప్పుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో డిపోకు 50 కొత్త బస్సులు కొనుగోలు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. కొత్త బస్సులను ఏర్పాటు చేయకుండా ఉన్న పల్లె వెలుగు బస్సులను ఉచిత బస్సు పథకానికి వాడేస్తే గందరగోళం తప్పదంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

కరువైన కనీస సౌకర్యాలు

ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసే నేపథ్యంలో బస్టాండ్‌లో మహిళలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ఆ మేరకు నిధులు విడుదల చేయలేదు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో పట్టణంలో 1978 డిసెంబర్ 14న అప్పటి ఏపీ రవాణా శాఖ మంత్రి ఆత్మకూరు వెంగళరెడ్డి చేతుల మీదుగా బస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. ప్రయాణికులతో పాటు ఆదాయం పెరిగినా అందుకు తగ్గట్లుగా సౌకర్యాలు పెంచలేదు. మహిళలకు ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇవ్వడం తప్ప అమలు చేయలేదు. వేలాదిమంది మహిళలు ఆర్టీసీకి పన్ను చెల్లిస్తూ ప్రయాణం చేస్తున్నా ఫలితం శూన్యం. అత్యవసర పరిస్థితుల్లో మూత్రశాలనే మరుగుదొడ్లుగా మహిళలు వాడటంతో పాటు మరుగుదొడ్లు ఏమాత్రం సరిపోతాయనే అంశాన్ని ఆర్టీసీ యంత్రాంగం గమనించడం లేదు. మరుగుదొడ్లతో పాటు మూత్రశాలలను పెంచాలని కోరుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. కనీసం మూత్ర విసర్జనకు కూడా అవకాశం లేదు. మహిళలు ఉగ్గబట్టుకొని తాలూకా సెంటర్‌కు వెళితే మున్సిపల్ మరుగుదొడ్లు తప్ప మూత్ర విసర్జన చేయలేని పరిస్థితి. మరుగుదొడ్లు లేకపోవడమే కాక బస్టాండ్ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. సాయంత్రం 6 అయితే దోమలు విలయతాండవం చేస్తున్నాయి. దీనికి తోడు బస్టాండ్‌లోకి ప్రవేశించే ముఖద్వారం, బయటకు వెళ్లే ప్రాంతంలో గోతులు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా మహిళల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

క్లుప్తంగా

కోళ్లూరు ప్రసన్నాంజనేయుని దేవస్థానం చైర్మన్‌గా జగన్

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్‌లో ప్రఖ్యాతి చెందిన కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ గురువారం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థాన చైర్మన్‌గా మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఆసుల జగన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈవో సనిమెల్ల కోటిరెడ్డి తెలిపారు. చైర్మన్‌తో పాటు 9 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సభ్యులుగా దేవస్థానంలో కల్యాణ మండప నిర్మాణ దాత గర్నేని హనుమంతరావు, తూనుగుంట్ల పద్మావతి (బెల్లంకొండ), అర్వపల్లి కామేశ్వర శాస్త్రి(బెల్లంకొండ), తురకా శివనాగదుర్గ (నాగిరెడ్డిపాలెం), పలుకూరి భాగ్యలక్ష్మీ(మాచాయపాలెం), తాళ్లూరి సైదమ్మ (చంద్రాజుపాలెం), వల్లూరి సత్యనారాయణ (పాపాయపాలెం), బూదాటి సీతయ్య (నందిరాజుపాలెం), దేవస్థాన అర్చకులు బొర్రా వెంకట అనంతాచార్యులును ఎక్స్ అఫీషియో మెంబర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. చైర్మన్‌గా తన నియామకానికి కృషి చేసిన కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు జగన్ కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9:30 గంటలకు స్వాతంత్య్ర వేడుకలు జరుగుతాయని పార్టీ నాయకులు గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దొడ్లేరు గ్రామంలో జ్వరాల సర్వే



దొడ్లేరు(క్రోసూరు): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో దొడ్లేరులో గురువారం వర్షం ప్రభావానికి గురైన గృహాలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. జ్వర పీడితులు ఎవరైనా ఉన్నారా అని సర్వే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో సత్తనపల్లి సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్, ఎంఎల్‌హెచ్‌పీ భూలక్ష్మి, ఆశా కార్యకర్త త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి పీ రమాదేవి



ముప్పాళ్ళ: వర్షాలతో గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పీ రమాదేవి చెప్పారు. వర్షాలకు నీరు కలుషితమయ్యే అవకాశముందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. నీరు కలుషితమైతే కలరా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. కాల్వల్లోను, ఖాళీ ప్రదేశాల్లో వర్షపునీరు నిలిచి పారిశుద్ధ్య సమస్యలతో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. మురుగు కాల్వల్లో ఇంజన్ ఆయిల్ చల్లుకున్నట్లయితే లార్వా చనిపోయే అవకాశం ఉందన్నారు. తరచూ చేతులను శుభ్ర పరుచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమ తెరలు వాడాలన్నారు.

కృష్ణానది తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

బెల్లంకొండ: భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరుతో కృష్ణా నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెల్లంకొండ తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాలు, పొంగే వాగులు, కాల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతుందన్నారు. మండలంలోని ఎమ్మాజీగూడెం, గోపాలపురం, కేతవరం, చిట్యాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ సమయంలోనైనా వరద ఉధృతంగా వచ్చే ప్రమాదం ఉందని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని, చిన్న చిన్న బోటుల ద్వారా అవతల ఒడ్డుకు ప్రయాణాలు నిలిపివేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో త్రిశక్తి దుర్గా పీఠం వార్షిక బ్రహ్మోత్సవాలు



సత్తెనపల్లి: త్రిశక్తి స్వరూపిణులైన మహాలక్ష్మి, దుర్గ, సరస్వతి అమ్మవార్ల త్రిశక్తి దుర్గా పీఠం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు మంగళవాయిద్యాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ, ప్రసన్నాంజనేయ స్వామికి లక్ష నాగవల్లి దళాలతో విశేష పూజలు నిర్వహించారు. పెరుమాళ్ళ పూర్ణచంద్రరావు, లక్ష్మీజయశ్రీ ఇంటి నుంచి జగన్నాథ భజన మండలి, ఆకుల గీతాలక్ష్మి సభ్యుల కోలాటంలతో అమ్మవార్ల ప్రభ బయలుదేరగా 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణిహరి ప్రారంభించి అమ్మవార్లకు పుష్పాభిషేకం అందించారు. త్రిశక్తి దుర్గా పీఠం మహిళాశక్తి సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవార్ల ఊరేగింపు త్రిశక్తి దుర్గా పీఠం గణేష్ యూత్, మహిళా శక్తి సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కలవకొలను సీతారామ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు. పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పత్తి పంటలో సస్యరక్షణ చేపట్టాలి

జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు


నందిగామలో నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పత్తి పంట పొలాల్లో నీటిని బయటకు పంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు అన్నారు. మండలంలోని నందిగామ గ్రామంలో వర్షాలకు నీట మునిగిన పత్తి పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పొలంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపించి, యూరియా 20 కేజీలు, పొటాష్ 10 కేజీలు ఎకరానికి చేనుపై వెదజల్లుకోవాలన్నారు. సత్తనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవో బి.సుబ్బారెడ్డి, రైతులు ఉన్నారు.

ఎరువులపై సమీక్ష...

సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని పీఏసీఎస్‌లు, జీడీసీఎమ్ఎస్, ఏబీఎఫ్ఎస్‌సీఎస్ ధూళ్ళిపాళ్ల బ్రాంచ్, తదితర ప్రభుత్వ రంగ సంస్థల సీఈఓ, ప్రెసిడెంట్లతో ఎరువుల అమ్మకాలపై జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు గురువారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలు ఈ-పాస్ ద్వారానే చేయాలన్నారు. భౌతిక నిల్వలకు ఈ-పాస్ మెషిన్‌లో పరిమాణాలకు వ్యత్యాసం ఉన్నట్లయితే వారికి ఎరువులు కేటాయింపు నిలిపివేయబడుతుందన్నారు. అదే విధంగా వారిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకోబడతాయన్నారు. ఎరువులు అమ్మకాలు జరిపి తరువాత తప్పనిసరిగా ఈ-పాస్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో సత్తెనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు, సత్తెనపల్లి, ముప్పాళ్ళ ఏవోలు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్ రెడ్డి, ఆయా పీఏసీఎస్‌లు, జీడీసీఎమ్ఎస్, ఏబీఎఫ్ఎస్‌సీఎస్ ధూళ్ళిపాళ్ల బ్రాంచ్ సీఈఓలు, ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలను పరిశీలించిన అధికారులు


దొడ్లేరు హసనాబాద్‌రోడ్డులో పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు, ఎస్ఐ రవిబాబు


ఉయ్యందనలో పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు, గ్రామ ప్రజలు


అందుకూరులో పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

దొడ్లేరు(క్రోసూరు): గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు భారీగా పొంగిన వరద నీరు గురువారం తగ్గుముఖం పట్టింది. బుధవారం మండలంలోని దొడ్లేరు గ్రామాన్ని మూడు వైపులా వరద చుట్టుముట్టి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలోని ముస్లిం కాలనీలోకి వరద నీరు చేరింది. గురువారం వర్షం లేకపోవటంతో వరద శాంతించింది. వరద పొంగు తగ్గిపోవటంతో గ్రామ ప్రజలు ఉపశమనం పొందారు. తహసీల్దార్ వి.వి.నాగరాజు, ఎస్ఐ పి.రవిబాబు దొడ్లేరు గ్రామం హసానబాద్‌లో రోడ్డు, పిడుగురాళ్ల రోడ్డులో లో లెవల్ చప్టాలను పరిశీలించారు. అదేవిధంగా అందుకూరు గ్రామంలోనిలో లెవల్ చప్టా , ఉయ్యందనలో లో లెవల్ చప్టాలను ఆయా గ్రామాల వీఆర్వోలు, పోలీసులు, గ్రామ ప్రజలు పరిశీలించారు. గ్రామాల్లో వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లించారు.

పైపులైనుకు లీకేజీ.. వృధాగా పోతున్న తాగునీరు



రక్షిత మంచినీరు వేలాది లీటర్లు వృధాగా పోతుంది. ప్రధాన పైపులైనుకు భారీ లీకేజీ ఏర్పడినా అధికారులు పట్టించుకోక నీరంతా రోడ్డు పాలవుతుంది. నకరికల్లులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి నరసరావుపేటకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన భారీ పైపులైనుకు నరసరావుపేట రోడ్డులోని 42వ మైలు వద్ద లీకేజీ ఏర్పడింది. ప్రధానలైనుకు ఏర్పడిన లీకేజీతో వేలాది లీటర్ల తాగునీరు రోడ్డుపాలవుతుంది. నరసరావుపేట-నకరికల్లు ప్రధాన రహదారి పక్కనే ఫౌంటేన్ మాదిరిగా లీకేజీ ఏర్పడినా అధికారుల కంట పడకపోవడం శోచనీయం. ఇదే విధంగా తాగునీరు వృధాగా పోతే తాగునీటి కటకటలాడే దుస్థితి ఏర్పడుతుంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయాలని ప్రజలకు కోరుతున్నారు.

-నకరికల్లు

రెవెన్యూ డివిజన్‌లో సగటున 57.86 మి.మీ వర్షపాతం నమోదు

సత్తనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్లో సగటున 57.86 మి.మీ వర్షపాతం గురువారం నమోదైంది. డివిజన్ వ్యాప్తంగా 520.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నకరికల్లు మండలంలో 90.8 మి.మీ నమోదు కాగా అత్యల్పంగా క్రోసూరులో 36.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా... సత్తెనపల్లి 54.8 మి.మీ , రాజుపాలెం 77.2, ముప్పాళ్ళ 38.6, నకరికల్లు 90.8, పెదకూరపాడు 50.2, అమరావతి 50.8, అచ్చంపేట 43.2, క్రోసూరు 36.8, బెల్లంకొండ 78.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన


నాగిరెడ్డిపాలెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ అరుణకుమారి, రైతులు


చిగురుపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మస్తానమ్మ, ఏఓ వెంకటేశ్వర్లు


అనంతవరంలో నీటి మునిగిన పత్తి పైర్లు

బెల్లంకొండ: భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాలలో నీట మునిగిన పంటలను గురువారం ఏవో అరుణకుమారి రైతులతో కలిసి పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో పంట పొలాలు వర్షం నీటితో నిండిపోయాయి. మండలంలోని నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ గ్రామాలలో పంట పొలాలను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలలోని పంట పొలాల్లో నీరు నిలిచిపోవడం మినహా, వరి, పత్తి పంటలు కొట్టుకొనిపోవడం వంటి నష్టం జరగలేదన్నారు. తీవ్రంగా పంట నష్టపోయిన రైతులు వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పత్తి, వరి పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని రైతులు వెళ్లబెట్టాలని సూచించారు. పత్తిలో పంటకు నష్టం జరుగకుండా ఉండేందుకు ఎకరాకు 30 కేజీల యూరియా, 10 కేజీల పోటాష్ పైపాటుగా వేయాలన్నారు. ఏవో వెంట వీఏవోలు, రైతులు ఉన్నారు.

నీట మునిగిన పత్తి పంటల పరిశీలన ..

అచ్చంపేట: భారీ వర్షాలకు నీట మునిగిన పత్తి పంటలను ఏడీఏ పి.మస్తానమ్మ గురువారం చిగురుపాడులో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. పంట రక్షణ కోసం తక్షణం తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపించాలని, తేలికపాటి కలుపుదులుపు చేసి వేర్లకు గాలి చొరబడేలా చూడాలన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించడం ద్వారా పత్తి పంటను పునరుద్ధరించుకొని నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏవో పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది రవిప్రకాష్, షరీఫ్, పవన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

క్రోసూరు: మండలంలో భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహించటంతో పంట పొలాలు వరద తాకిడికి గురయ్యాయి. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం వాగులకు దగ్గరగా ఉన్న పత్తి పొలాలు 185 హెక్టార్లలో నీళ్లు నిలబడినట్లు ఏవో తెలిపారు. అదే విధంగా మండలంలోని అనంతవరం గ్రామంలో కొంత మంది రైతుల వరి నారు వరదలో మునిగిపోయింది. గురువారం వ్యవసాయాధికారులు పత్తి పైర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సస్యరక్షణ సూచనలు చేశారు.

స్త్రీ శక్తి పథకాన్ని అన్ని బసుల్లో అమలు జరపాలి

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారపు శివనాగేశ్వరరావు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ఏడాది దాటిన తర్వాత ఈ నెల 15 నుంచి అమలు చెయబోతున్న స్త్రీ శక్తి పథకం అన్ని బస్సుల్లోనూ మహిళలకు ఆంక్షలు లేకుండా అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఐదు రకాల బస్సుల్లోనే స్త్రీ శక్తి పథకం అమలు చేయడం సరికాదని, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, సూపర్ డీలక్స్, అల్ట్రా డీలక్స్, నాన్ స్టాపులు, అంతరాష్ట్ర సర్వీసులు, పుణ్య క్షేత్రాలకు వెళ్ల అన్ని రకాల బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం అమలు చేయాలన్నారు. ప్రతి పల్లెకు సర్వీస్‌ను పునరుద్ధరించాలని, ప్రజా రవాణా సరిగా ఉంటేనే ఆకుపెన్సీ పెరిగి రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహోత్సవాలు


విద్యుద్దీపాల వెలుగులో పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం

రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం 13వ వార్షిక బ్రహోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. రాజుపాలెంకు చెందిన పొత్తూరి నరసాదాస్, తిరుపతమ్మల తనయుడు పొత్తూరి వెంకట రామసుబ్బారావు ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ వరకు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2012 జూలై 26న నిర్మించిన ఆలయంలో గత 12 ఏళ్లుగా బ్రహోత్సవాలు వైభవంగా జరిపిస్తున్నారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా పిలువబడే వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలను క్రమం తప్పకుండా శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు.

భక్తుల సహకారం ఎనలేనిది

గత 12 ఏళ్లుగా రాజుపాలెంలో పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులు అందిస్తున్న సహకారం ఎనలేనిది. భక్తజనం సహకారంతో నిర్వహించే వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలి.

– పొత్తూరి వెంకట రామసుబ్బారావు

చిత్తడి రోడ్లపై వెళ్లేదెలా..!


చిత్తడిగా ఉన్న బెల్లంకొండ - వన్నాయపాలెం రోడ్డు


అధ్వానంగా మారిన వెంకటాయపాలెం ఆశ్రమం, పొలాలకు వెళ్లే రోడ్డు

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో పొలాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉండడంతో పొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లన్నీ గుంతలు పడి ఉండడంతో పాటుగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతలలో నీరు నిలిచి చిత్తడిగా మారాయి. మండలంలోని బెల్లంకొండ బీసీ కాలనీ నుంచి వన్నాయపాలెం వైపు వెళ్లే రోడ్డు, నందిరాజుపాలెంలో ఊళ్లో నుంచి చెరువు వైపు పొలాలకు వెళ్లే దారి చిత్తడిగా మారాయి. అదే విధంగా వెంకటాయపాలెంలో శింగరేశ్వరస్వామి ఆశ్రమం వైపు పొలాలకు వెళ్లే రోడ్డు గుంతలు పడి, బురదమయంగా మారింది. దీంతో ఆశ్రమం వద్దకు వెళ్లే భక్తులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా పొలాలకు వెళ్లే రైతులు రోడ్లపై నడవలేక అవస్థలు పడుతున్నారు. నాగిరెడ్డిపాలెం, మాచాయపాలెం గ్రామాలలో ఎన్ఎస్‌పీ కాలువ పక్కన రహదారి గుంతలమయంగా మారడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. పొలాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



నకరికల్లు: వర్షాలు ముమ్మరంగా పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీవో కె.వి.శివప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని చల్లగుండ్లతో పాటు పలు గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు శాంతించినందున పేరుకుపోయిన వ్యర్థాలు, మురుగు కాలువల్లో షిల్ట్‌ను తొలగించి, మురుగునీటి పారుదలను క్రమబద్ధీకరించాలన్నారు. బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్య సిబ్బందిని సమన్వయపరచుకొని తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అబ్దుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.